సాక్షి ఖమ్మం

బుధవారం । 27 । సెప్టెంబర్ । 2023



'సీతారామ' రూపకర్త కేసీఆరే

ఉమ్మడి జిల్లా రైతులకు మేలు చేయనున్న సీతారామ ప్రాజెక్టు రూపకర్త కేసీఆరేనని సత్తుపల్లి ఎమ్మెల్యే వెంకటవీరయ్య తెలిపారు.

8లో



వారంలోగా రుణమాఫీ పూర్తి

జిల్లాలో రైతులకు సంబంధించి రుణాల మాఫీ ప్రక్రియను వారంలోగా పూర్తి చేయాలని కలెక్టర్ గౌతమ్ సూచించారు.

8లో

గరిష్టం / కనిష్టం

34° / 24°

వాతావరణం

జిల్లాలో బుధవారం వాతావరణం మేఘావృతమై ఉంటుంది. కొన్నిచోట్ల చిరుజల్లులు మొదలు ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశముంది.

యాసంగిపైనే ఆశలు

- చేదు జ్ఞాపకాలను మిగిల్చిన ఖరీఫ్
- జిల్లాల్లో లక్ష్యాన్ని చేరని వరి, పత్తి పంటల సాగు
- వేసిన పంటలకూ నీటి కొరతతో ఇబ్బంది
- సాగర్ నీళ్లు రాక వెలవెలబోయిన ఆయకట్టు భూములు



మంగాపురం మేజర్-19 కాల్వ కింద బీడుగా ఉన్న రైతుల భూములు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: వాతావరణ పరిస్థితులు, నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిండకపోవడం తదితర కారణాలతో జిల్లాలో వానాకాలం సాగు ఆశాజనకంగా లేదు. లక్ష్యం మేరకు పంటలు సాగు కాకపోగా... సాగైన పంటలకు కూడా నీటి లభ్యత కరువైంది. దీంతో పలుచోట్ల వరి, పత్తి పంటలు దెబ్బతింటున్నాయి. వరి పొలాలు నెర్రెలు బారి దర్శనమిస్తుండగా.. పత్తి ఏపుగా పెరగలేదు. కృష్ణా నది ఎగువన వర్షాలు లేక ఇప్పటివరకు సాగర్ నిండలేదు. దీంతో వచ్చే నెల రోజుల్లో వర్షాలు కురుస్తాయని భావిస్తున్న రైతులు యాసంగి పంటలపైనే ఆశలు పెట్టుకున్నారు.

ఆది నుంచీ ప్రతికూలమే

ఈ వానాకాలం సీజన్ మొదటి నుంచి ప్రతికూలంగానే సాగింది. తొలినాళ్లలో వర్షాభావంతో నాట్లు, విత్తనాలు వేయడం ఆలస్యమైంది. జూలై మూడో వారంలో భారీ వర్షాలు కురిసినా.. మళ్లీ తర్వాత ముఖం చాటేశాయి. వర్షాలు లేని సమయాన ఎండలు పెరిగి పంటపై ప్రభావాన్ని చూపాయి. దీనికి తోడు కృష్ణా నదికి ఎగువన వర్షాలు లేక నాగార్జునసాగర్ నిండలేదు. ఫలితంగా జిల్లాలో సాగర్ నీటిపై ఆధారపడి పంటలు సాగు చేసే రైతులు భూములను వదిలేశారు. ఎడమకాల్వ రెండో జోన్ పరిధి జిల్లాలో ఉన్న 2,54,270 ఎకరాల ఆయకట్టులో మూడో వంతు మాత్రమే సాగు చేస్తుండగా.. ఈ పంటలకు కూడా నీళ్లు లేక రైతులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు.

సాగు లక్ష్యాన్ని చేరుకోలేక..

ఈ వానాకాలం సీజన్‌లో మొత్తం 6.50 లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతాయని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. కానీ 6.06 లక్షల ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. ఇందులో వరి సాగు లక్ష్యం 2,89,983 ఎకరాలు కాగా.. 2,69,500 ఎకరాల్లో, పత్తి 2,23,617 ఎకరాలకు 1,83,877 ఎకరాల్లో సాగైంది. అయితే, రైతులు మిర్చి మాత్రం 71,503 ఎకరాల్లో సాగు చేశారు. ఈ పంటలు కూడా వర్షాభావ పరిస్థితులతో ఆలస్యమయ్యాయి. వైరా, పాలేరు రిజర్వాయర్లు నిండకపోవడం, అడపాదడపా వర్షాలు కురుస్తుండడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. దీంతో రైతులు ఎక్కువగా బోర్లు, బావుల ఆధారంగానే పంటలు సాగు చేస్తున్నారు. కాగా, రైతులు సాగు చేసిన పంటల పరిస్థితి కూడా నానాటికీ తీసికట్టుగా మారుతోంది. ప్రధానంగా సాగర్ ఆయకట్టు చివరి భూముల్లో పరిస్థితి దారుణంగా ఉంది. ఈ భూముల్లో చాలామంది సాగు చేయక వదిలేశారు. సాగు చేసిన ప్రాంతాల్లో నీళ్లు లేక భూములు నెర్రెలిచ్చాయి. అలాగే, ప్రతికూల పరిస్థితుల కారణంగా పత్తి ఇప్పటికే నాలుగు అడుగుల మేరకు పెరగాల్సి ఉండగా.. అతి తక్కువగా పెరిగి పూత, కాత కూడా బాగాలేదు.

యాసంగికి ఎదురుచూపు

జిల్లాలో ప్రధాన సాగు నీటి వనరైన నాగార్జునసాగర్ నుంచి వానాకాలం నీటి విడుదల లేకపోవడంతో రైతులు యాసంగి సాగు కోసం ఎదురుచూస్తున్నారు. వర్షాలతో సాగర్ నిండితే యాసంగికైనా విడుదల చేస్తారనే ఆశతో ఉన్నారు. గతంలో యాసంగికి నీళ్లు విడుదల చేస్తే వరితో పాటు ఇతర మెట్ట పంటలు కూడా సాగయ్యాయి. ఒకవేళ సాగర్ నీళ్లు రాకపోతే పాలేరు, వైరా రిజర్వాయర్ల పరిధిలో సైతం యాసంగికి సాగుకు నీళ్లు వదిలే అవకాశం ఉండదు.

ఈ ఏడాది వానాకాలం సాగు చేసిన పంటలు (ఎకరాల్లో)

పంట	విస్తీర్ణం
వరి	2,69,500
పత్తి	1,83,877
మొక్కజొన్న	2,549
పెసర	15,254
చెరకు	50,600
మొత్తం	5,21,780

ఉద్యాన పంటలు

పంట	విస్తీర్ణం
మిర్చి	71,503
మామిడి	6,694
ఆయిల్‌పామ్	3,762
సుబాబుల్	114
ఇతర పంటలు	2,187
మొత్తం	84,260

వ్యవసాయ పంటలు	5,21,780
ఉద్యాన పంటలు	84,260
మొత్తం	6,06,040

సాగర్ నీళ్లు లేకున్నా వర్షాలతో ఇటీవల పాలేరు, వైరా రిజర్వాయర్లు నిండగా వానాకాలం పంటలు సాగయ్యాయి. అంతేకాకుండా బోర్లు, బావులు, చెరువుల్లోకి నీళ్లు వచ్చాయి. అయితే, యాసంగిలో కూడా సాగర్ నీళ్లు రాకపోతే ఈ నీటి ఆవాసాలన్నీ వట్టిపోయి.. ఆయకట్టు బీడుగా మారనుంది.

బీడుగా మూడెకరాలు

ఈ ఫొటోలో కనిపిస్తున్న భూమి చింతకాని మండలం మత్కేపల్లికి చెందిన నర్సింశెట్టి లక్ష్మీనారాయణది. సాగర్ ఆయకట్టు పరిధిలో మూడు ఎకరాల వ్యవసాయ భూమి ఉండగా, గత ఏడాది పత్తి, పెసర పంటలను సాగుచేశాడు. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులకు తోడు సాగర్ జలాలు రాక వానాకాలం పత్తి పంట వేయలేదు. యాసంగిలోనైనా పెసర, మొక్కజొన్న సాగు చేద్దామని భావిస్తున్నాడు. అయితే సాగర్ జలాల విడుదలపై స్పష్టత లేక పరిస్థితి ఎలా ఉంటుందోనని వాపోతున్నాడు.





లక్ష్మీనారాయణ సాగు చేయకుండా వదిలేసిన సాగర్ ఆయకట్టులోని భూమి (ఇన్‌సెట్‌లో లక్ష్మీనారాయణ)

సాగు చేయలేక పోయా..



నాకు మంగాపురం మేజర్ 19 కాలవ కింద 5.50 ఎకరాల భూమి ఉంది. సాగర్ కాల్వ వస్తే వరి పంట సాగు చేద్దాం అనుకున్నా. అయితే, సాగర్ ప్రాజెక్టు నుంచి నీళ్లు రాలేదు. దీంతో భూమి బీడుగానే వదిలేశా. యాసంగిలోనైనా నీరు విడుదల అవుతుందో, లేదో అని అనుమానంగా ఉంది.

– గుడవర్తి నాగేశ్వరరావు, అనాసాగరం, నేలకొండపల్లి మండలం

ప్రజలకు అండగా 'సాక్షి'

నేడు కేఎంసీ డిప్యూటీ కమిషనర్‌తో ఫోన్ ఇన్..



బి.మల్లీశ్వరి, డిప్యూటీ కమిషనర్, కేఎంసీ



ఖమ్మంమయూరిసెంటర్: తరచుగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని లోతట్టు ప్రాంతాలు, ఖాళీ ప్లాట్లలో నీరు నిలిచి దుర్వాసన వెదజల్లుతోంది. అంతేకాకుండా పలుచోట్ల పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారడంతో దోమల వ్యాప్తి పెరిగి ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడుతున్నారు. ఈ నేపథ్యాన సమస్యలను పరిష్కరించేలా ప్రజలు – అధికారుల నడుమ వారధిగా వ్యవహరించాలని 'సాక్షి' నిర్ణయించింది. ఈమేరకు బుధవారం జరిగే ఫోన్ ఇన్‌లో కేఎంసీ డిప్యూటీ కమిషనర్ మల్లీశ్వరి పాల్గొని ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి చర్యలు చేపట్టనున్నారు.

తేదీ : 27-09-2023, బుధవారం

సమయం : ఉదయం 10 నుంచి 11 గంటల వరకు

ఫోన్ చేయాల్సి నంబర్

79012 98265

న్యూస్‌రీల్

జమలాపురం హుండీ ఆదాయం రూ.37.28లక్షలు



కానుకలు లెక్కిస్తున్న సిబ్బంది, అర్చకులు

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా పేరున్న మండలంలోని జమలాపురం శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను మంగళవారం లెక్కించారు. దేవాదాయ శాఖ ఖమ్మం డివిజన్ ఇన్‌స్పెక్టర్ ఆర్.సమత, ఆలయ ఈఓ కె.జగన్మోహన్‌రావు సమక్షాన హుండీలు తెరిచి లెక్కించగా 92 రోజులకు గాను రూ.37,28,595 ఆదాయం నమోదైంది. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, సూపరింటెండెంట్ కె విజయకుమారి, ఉప ప్రధాన అర్చకులు ఉప్పల విజయదేవశర్మతో పాటు మధిర శ్రీ సత్యసాయి సేవా సమితి బాధ్యులు పాల్గొన్నారు.

నేడు 'నిధి ఆప్ కే నిఖత్'

ఖమ్మంసహకారనగర్: ఈపీఎఫ్ చందాదారులు, పెన్షనర్లు, యాజమాన్యాల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు బుధవారం 'నిధి ఆప్ కే నిఖత్' నిర్వహిస్తున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ ఎం.డీ.సలీంఖాన్ ఓ ప్రకటనలో తెలిపారు. ఖమ్మం జిల్లా వారి కోసం నేలకొండపల్లి మండలం రాజేశ్వరపురంలోని మధుకాన్ షుగర్స్ లిమిటెడ్‌లో, భద్రాద్రి జిల్లా వాసులకు అశ్వాపురంలోని గౌతమినగర్ తరంగిణి ఫంక్షన్ హాల్‌లో కార్యక్రమం ఏర్పాటుచేసినట్లు చెప్పారు. ఈమేరకు ఉద్యోగులు, యాజమానులు హాజరై సమస్యలు పరిష్కరించుకోవచ్చని తెలిపారు.

వైరా ఏటీడీఓగా జహీరుద్దీన్



డీటీడీఓ నుంచి ఉత్తర్వులు అందుకుంటున్న జహీరుద్దీన్

ఖమ్మంమయూరిసెంటర్: వైరా అసిస్టెంట్ ట్రైబల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్(ఏటీడీఓ)గా ఎస్.కె.జహీరుద్దీన్ నియమితులయ్యారు. ప్రస్తుతం ఆయన వరంగల్‌లో డీటీడీఓగా విధులు నిర్వర్తిస్తుండగా ఇక్కడకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా జహీరుద్దీన్ మంగళవారం ఖమ్మంలో డీటీడీఓ కృష్ణానాయక్‌ను మర్యాదపూర్వకంగా కలిశాక బాధ్యతలు స్వీకరించారు.

బదిలీలు, పదోన్నతులపై నేడు అప్పీళ్ల స్వీకరణ

ఖమ్మంసహకారనగర్: గ్రేడ్–2 హెచ్‌ఎంల బదిలీలు, పదోన్నతులకు సంబంధించి బుధవారం అప్పీళ్లు స్వీకరించనున్నారు. జిల్లా కేంద్రంలోని తమ కార్యాలయంలో నేడు మధ్యాహ్నం 2గంటల వరకు అప్పీళ్లు అందచేయొచ్చని డీఈఓ సోమశేఖరశర్మ ఓ ప్రకటనలో తెలిపారు. బదిలీలు, పదోన్నతుల కారణంగా స్పౌజ్ కేటగిరీ విషయంలో జరిగిన మార్పులు, చేర్పులు చేయాల్సి ఉంటే వివరాలు అందజేయాలని ఆయన సూచించారు.

వీరనారి చాకలి ఐలమ్మ

మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్



ఐలమ్మ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి పువ్వాడ, ఎంపీ వద్దిరాజు, కలెక్టర్ గౌతమ్ తదితరులు

ఖమ్మంమయూరిసెంటర్: నిజాం పాలన, విసునూరు దేశ్‌ముఖ్‌లకు వ్యతిరేకంగా పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ అని రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు. చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా ప్రభుత్వ ఆస్పత్రి సమీపాన ఆమె విగ్రహానికి ఎంపీ వద్దిరాజు రవిచంద్రతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి పువ్వాడ మాట్లాడుతూ ఐలమ్మ ఆనాడు చేసిన పోరాటమే తెలంగాణ సాయుధ పోరాటం, మలిదశ తెలంగాణ ఉద్యమానికి స్ఫూర్తిగా నిలిచిందని తెలిపారు. జిల్లా కలెక్టర్ గౌతమ్, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, మేయర్ పునుకొల్లు నీరజ, సుడా, మార్కెట్ చైర్మన్లు బచ్చు విజయ్‌కుమార్, దోరేపల్లి శ్వేత, అదనపు డీసీపీ కేఆర్‌కే.ప్రసాద్ రావు, జిల్లా బీసీ సంక్షేమ అధికారిణి జి.జ్యోతి, నాయకులు రేగళ్ల కొండలు, డాక్టర్ పాపారావు, పగడాల నాగరాజు, తాంగేళ్లపల్లి శ్రీనివాస్, బొమ్మ రాజేశ్వరరావు, జ్యోతి, లింగబోయిన పుల్లారావు, తెనాలి వీరబాబు, బొడ్డు ఉపేందర్, కణతల నరసింహారావు పాల్గొన్నారు.

రూ.500 కోట్లతో పేదలకు ఇళ్లు

ఖమ్మం నియోజకవర్గంలో పేదలకు గూడు కల్పించేందుకు రూ.500 కోట్ల నిధులు వెచ్చించామని రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. ఖమ్మంలో మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో జీఓ 58 కింద ఇళ్ల స్థలాల పట్టాలు, గృహలక్ష్మి మంజూరు పత్రాలను ఎంపీ వద్దిరాజు రవిచంద్రతో కలిసి పంపిణీ చేశాక పువ్వాడ మాట్లాడారు. నియోజకవర్గంలో ఇప్పటివరకు 58 జీఓ కింద 3 వేల మందికి పట్టాలు ఇవ్వగా, మరో 2 వేల మందికి ఇస్తామన్నారు. అలాగే, డబుల్‌బెడ్‌రూం ఇళ్లు 6,400మందికి కేటాయించామని, గృహలక్ష్మి ద్వారా 3వేల మందికి లబ్ధి జరగనుందన్నారు. కాగా, గ్యారంటీ కార్డులతో వస్తున్న వారి మాటలు నమ్మి మోసపోవద్దని కోరారు. ఎంపీ రవిచంద్ర మాట్లాడుతూ కేసీఆర్ సీఎం కావడంతో మహిళలకు గౌరవం పెరిగిందని తెలిపారు. మేయర్ పునుకొల్లు నీరజ, సుడా, మార్కెట్ చైర్మన్లు విజయ్‌కుమార్, దోరేపల్లి శ్వేత, డీసీ మల్లీశ్వరి పాల్గొన్నారు.

పకడ్బందీగా ఓటర్ల జాబితా

- ఎలాంటి లోటుపాట్లు ఉండొద్దు
- జిల్లా ఎలక్ట్రోరల్ రోల్ పరిశీలకులు బాలమాయాదేవి



మాట్లాడుతున్న బాల మాయాదేవి, పక్కన కలెక్టర్ గౌతమ్, అధికారులు

ఖమ్మంసహకారనగర్: ఓటరు జాబితాలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీగా రూపొందించాలని జిల్లా ఎలక్టోరల్ రోల్ పరిశీలకులు, చీఫ్ రేషనింగ్ అధికారి బి.బాల మాయాదేవి సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో కలెక్టర్ వీ.పీ.గౌతమ్‌తో కలిసి ఆమె ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, తొలగింపులు తదితర అంశాలపై ఈఆర్వోలతో సమీక్షించారు. ఈ సందర్భంగా బాలమాయాదేవి మాట్లాడుతూ మరణించిన వారి పేర్ల తొలగింపు విషయంలో క్షేత్రస్థాయిలో పరిశీలించాలని తెలిపారు. అలాగే, ఓటరు నమోదు దరఖాస్తులను తిరస్కరిస్తే తగిన కారణాలను చెప్పాలన్నారు. కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ జిల్లాలో ఓటరు జాబితా తయారీకి తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు బి.సత్యప్రసాద్, డి.మధుసూదన్ నాయక్, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్‌సురభి, ఆర్డీఓలు జి.గణేష్, అశోక్ చక్రవర్తి, ఎస్డీసీ రాజేశ్వరి, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో తనిఖీ

వైరా/ఖమ్మం సహకారనగర్: జిల్లా ఎలక్ట్రోరల్ రోల్ పరిశీలకులు బాలమాయాదేవి జిల్లాలోని పలు పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. జిల్లా కేంద్రంలోని అటవీ అధికారి కార్యాలయం, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, కొనిజర్ల మండలం తనికెళ్లలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, వైరా మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలల్లోని పోలింగ్ కేంద్రాల్లో పరిశీలించి దరఖాస్తుల పరిష్కారం, కేంద్రాల్లో ఏర్పాట్లపై ఉద్యోగులతో సమీక్షించారు. కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్ సత్యప్రసాద్, ఖమ్మం తహసీల్దార్ సీహెచ్.స్వామి, ఎంపీడీఓ కరుణాకర్‌రెడ్డి, ఆర్ఐ అనిల్ పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాలో పది సీట్లు గెలుస్తాం

ఎంపీ నామ, మంత్రి పువ్వాడ తదితరుల భేటీ



ఖమ్మంమయూరిసెంటర్: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పది సీట్లు గెలుచుకుంటామని మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎంపీ నామ నాగేశ్వరరావు ధీమా వ్యక్తం చేశారు. ఖమ్మంలోని ఎంపీ నామ నివాసంలో ఎంపీతో పాటు మంత్రి పువ్వాడ, ఎమ్మెల్సీ తాత మధుసూదన్‌రావు, వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్, బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బానోత్ మదన్‌లాల్ మంగళవారం సమావేశమయ్యారు. ఈసందర్భంగా రాములునాయక్, మదన్‌లాల్‌తో చర్చించి నేతలంతా సమైక్యంగా పనిచేస్తూ పార్టీ విజయంలో పాలుపంచుకోవాలని తెలిపారు. ప్రతీ బూత్‌లో అత్యధిక మెజార్టీ సాధించడమే లక్ష్యంగా పనిచేయాలని చెప్పారు. రానున్న ఎన్నికలను అందరూ ప్రతిష్టాత్మకంగా తీసుకుని ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను గడపగడపకూ తీసుకెళ్లాలని నిర్ణయించారు. ఇంకా ఈ సమావేశంలో రైతుబంధు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు నల్లమల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

డీసీసీబీ ముల్కలపల్లి బీఎం సస్పెన్షన్

- 'ముద్ర'తో పాటు ఇతర రుణాల్లో అక్రమాలపై కొరడా
- టేకులపల్లి, మర్లపాడు బ్రాంచ్‌ల్లో కొనసాగుతున్న విచారణ

సాక్షి ఎఫెక్ట్..

ఖమ్మంవ్యవసాయం: డీసీసీబీ పరిధిలోని పలు బ్రాంచ్‌ల్లో 'ముద్ర' రుణాల జారీ సందర్భంగా అక్రమాలు బయటపడుతున్నాయి. ఇప్పటికే అన్నపురెడ్డిపల్లి బ్రాంచ్ మేనేజర్‌ను సస్పెండ్ చేయగా మరో మూడు బ్రాంచ్‌ల్లోనూ అక్రమాలు జరిగాయని 'డీసీసీబీలో ఇంటి దొంగలు' శీర్షికన 'సాక్షి'లో మంగళవారం కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన అధికారులు విచారణ చేపట్టగా ముల్కలపల్లి బ్రాంచ్ మేనేజర్ జె.కిషోర్ అక్రమాలు పాల్పడినట్లు తేలడంతో మంగళవారం సస్పెండ్ చేశారు. ఆయన స్థానంలో అసిస్టెంట్ మేనేజర్ రవికి బాధ్యతలు అప్పగిస్తూ సీఈఓ వీరబాబు ఉత్తర్వులు జారీ చేశారు. ఇక టేకులపల్లి, మర్లపాడు బ్యాంకు బ్రాంచ్‌ల్లోనూ విచారణ కొనసాగుతోంది.

అక్రమాల పరంపర

చిరువ్యాపారులు, స్వయం ఉపాధి పొందే వారికి కేంద్రప్రభుత్వం ముద్ర(మైక్రో యూనిట్స్ డెవలప్‌మెంట్ అండ్ రీ ఫైనాన్స్ ఏజెన్సీ) పేరిట రుణాలు ఇస్తోంది. ఈమేరకు డీసీసీబీ పరిధిలోని పలు బ్రాంచ్‌ల మేనేజర్లు ఇష్టారాజ్యంగా రుణాలను పంపిణీ చేశారనే ఆరోపణలు ఉన్నాయి. కొందరు రూ.50 వేల రుణానికి రూ.5 వేలు, రూ.లక్షకైతే రూ.10 వేల చొప్పున వసూలు చేసినట్లు సమాచారం. ఇంకొందరు తమ బంధువులు, పనివారికి రుణాలు ఇచ్చినట్లు తేలింది. తొలుత అన్నపురెడ్డిపల్లి బ్రాంచ్‌లో, ఆతర్వాత ముల్కలపల్లి, టేకులపల్లి, మర్లపాడు బ్రాంచ్‌ల్లో అక్రమాలు వెలుగు చూడగా ఇప్పటికే ఇద్దరు బీఎంలను సస్పెండ్ చేశారు. ఇక టేకులపల్లి బ్రాంచ్‌లో నిబంధనలను అతిక్రమించి రుణాలు ఇచ్చినట్లు గుర్తించగా ఏజీఎం వెంకటేశ్వర్లు ఆధ్వర్యాన విచారణ జరుగుతోంది. అలాగే, మర్లపాడులో అక్రమాలపై బ్యాంకు అధికారి అజయ్‌రెడ్డి విచారణ సాగిస్తున్నారు.

అక్రమాలను సహించేది లేదు..



డీసీసీబీ పరిధిలో అక్రమాలకు పాల్పడే వారి విషయంలో ఉపేక్షించేది లేదు. ఇప్పటికే ఇద్దరు బ్రాంచ్ మేనేజర్లను సస్పెండ్ చేశాం. మరో ఇద్దరిపై విచారణ జరుగుతోంది. ముద్రతో పాటు ఇతర రుణాలు, కార్యకలాపాల్లో అక్రమాలు, అవినీతికి పాలపడే వారిపై చర్యలు తప్పవు.

– కూరాకుల నాగభూషణం, డీసీసీబీ చైర్మన్

నిమజ్జనానికి వేళాయె...

- నేడు గణనాథుడి శోభాయాత్ర, నిమజ్జనం
- కాల్వొడ్డు, ప్రకాష్‌నగర్ మున్నేరు వద్ద ఏర్పాట్లు
- 15 క్రెయిన్ల ఏర్పాటు, 100 మంది గజ ఈతగాళ్లు సిద్ధం
- ఖమ్మం గాంధీచౌక్ వద్ద స్వాగతం, వీడ్కోలు సభ



కాల్వొడ్డు మున్నేరు వద్ద చదును చేయించిన రహదారి

ఖమ్మంగాంధీచౌక్: తొమ్మిది రోజుల పాటు వైభవంగా పూజలందుకున్న గణనాథుడి నిమజ్జనం బుధవారం నిర్వహించేందుకు భక్తులు సిద్ధమవుతున్నారు. జిల్లావ్యాప్తంగా ఈ ఏడాది చిన్నా పెద్ద కలిపి మొత్తం 4 వేలకు పైగా విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఇందులో ఖమ్మం నగరం, పరిసర ప్రాంతాల్లో వెయ్యి నుంచి 1,300 వరకు విగ్రహాలు ఉంటాయని అంచనా. ఈనెల 18 నుంచి గణనాథుడికి పూజలు చేస్తున్న భక్తులు నిమజ్జనం చేసేందుకు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

ఖమ్మంలో ప్రత్యేక ఏర్పాట్లు

ఖమ్మం నగరంలో గణనాథుడి శోభాయాత్ర, నిమజ్జనానికి ప్రత్యేక ఏర్పాట్లు జరుగుతున్నాయి. వివిధ ప్రభుత్వ శాఖలతో పాటు స్తంభాద్రి ఉత్సవ సమితి ఆధ్వర్యాన ఏర్పాట్లు చేశారు. నగరం నలుమూలల నుంచి ఊరేగింపుగా వచ్చే గణనాథుల శోభాయాత్రకు గాంధీచౌక్‌లో స్వాగతం పలికేలా స్తంభాద్రి ఉత్సవ కమిటీ బాధ్యులు సిద్ధమయ్యారు. అనంతరం విగ్రహాలను త్రీటౌన్‌లోని కాల్వొడ్డు, ప్రకాష్‌నగర్ మున్నేరుల్లో నిమజ్జనం చేయనున్నారు. ఇందుకోసం రాకపోకలకు వేర్వేరు మార్గాలు ఏర్పాటుచేయడమే కాక సీసీ కెమెరాలు బిగించడంతో పాటు విద్యుత్ సౌకర్యం, జనరేటర్లు ఏర్పాటు చేశారు. ఇక నాయుడు పేట వైపు ఉన్న మున్నేరు ఒడ్డున కూడా నిమజ్జనానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి.

క్రేన్ల సాయంతో...

గణపతి నిమజ్జనానికి 15 క్రెయిన్లు వినియోగించనున్నారు. కాల్వొడ్డులో 10, ప్రకాష్‌నగర్‌లో రెండు క్రెయిన్లతో పాటు ఇంకో మూడు అదనంగా అందుబాటులో ఉంచుతున్నారు. అలాగే, 100 మందికి పైగా గజ ఈతగాళ్లను సిద్ధం చేశారు. మున్నేరు నీటి ప్రవాహం సాధారణ స్థాయిలోనే ఉన్నప్పటికీ ఇతరులు లోనకు వెళ్లకుండా గజ ఈతగాళ్లను నియమించారు.

600 మందితో బందోబస్తు

ఖమ్మంక్రైం: ఖమ్మంలో బుధవారం జరిగే వినాయక నిమజ్జనం సందర్భంగా పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లుచేశారు. అలాగే, ట్రాఫిక్ ఆంక్షలు విధించినట్లు సీపీ విష్ణు ఎస్.వారియర్ తెలిపారు. ఈనేపథ్యాన వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలు ఎంచుకోవాలని ఆయన సూచించారు. నిమజ్జనం సమయాన ఒక్కో వాహనం వెంట ఇద్దరిని మాత్రమే లోనకు అనుమతిస్తామని తెలిపారు. అలాగే, వైన్స్, బార్లను మూసివేయనుండగా శోభాయాత్రలో సౌండ్‌సిస్టమ్, డీజేలు వినియోగించొద్దని చెప్పారు. అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా, ట్రాఫిక్ సమస్యలు ఎదురుకాకుండా 600 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటుచేసినట్లు సీపీ తెలిపారు. ఎనిమిది మంది ఏసీపీలు, 17మంది సీఐలు, 40మంది ఎస్ఐలు, 125 మంది ఏఎస్ఐలు, హెడ్‌కానిస్టేబుళ్లు, 281మంది కానిస్టేబుళ్లు, 106మంది హోంగార్డులు పాల్గొంటారని చెప్పారు.

శోభాయాత్ర మార్గాలు...

- **మామిళ్లగూడెం ఏరియా :** మయూరిసెంటర్, కిన్నెర పాయింట్, జెడ్పీ సెంటర్, చర్చి కాంపౌండ్ మీదుగా ప్రకాష్‌నగర్‌లోని మున్నేరు లేదా నయాబజార్ మున్నేరు పాయింట్‌కు చేరాలి.
- **ఆర్టీఏ, బ్యాంక్ కాలనీ ప్రాంతం :** ఎన్టీఆర్ సర్కిల్, ఇల్లెందు క్రాస్, జెడ్పీసెంటర్, చర్చికాంపౌండ్ మీదుగా ప్రకాష్‌నగర్ లేదా నయాబజార్ మున్నేరు నిమజ్జనం పాయింట్‌కు చేరుకోవాలి.
- **రోటరీనగర్, ఇందిరానగర్ ప్రాంతాలు :** మమత క్రాస్‌రోడ్, వీఆర్‌కే సిల్క్స్, ఇల్లెందు క్రాస్‌రోడ్, జెడ్పీసెంటర్, చర్చి కాంపౌండ్ మీదుగా రావాలి..
- **కస్బాబజార్, కమాన్ బజార్ :** చర్చి కాంపౌండ్, ప్రకాష్‌నగర్ లేదా నయాబజార్ మీదుగా మున్నేరు నిమజ్జనం పాయింట్‌కు చేరుకోవచ్చు.
- **గొల్లగూడెం, శ్రీనగర్ కాలనీ :** లకారం ట్యాంక్ బండ్ నుండి టాటా మోటార్స్, చెరువు బజార్, చర్చి కాంపౌండ్, ప్రకాష్‌నగర్ మున్నేరు లేదా నయాబజార్ మున్నేరు నిమజ్జనం పాయింట్‌కు భక్తులు రావాలి.
- **శ్రీరామ్‌హిల్స్, ముస్తఫానగర్ :** ముస్తఫానగర్, చర్చి కాంపౌండ్ నుంచి ప్రకాష్‌నగర్ లేదా నయాబజార్ మున్నేరు నిమజ్జనం పాయింట్‌కు రావొచ్చు.
- **వైరారోడ్డు ప్రాంతం :** జెడ్పీసెంటర్, చెరువుబజార్, చర్చి కాంపౌండ్ మీదుగా నిమజ్జన ప్రాంతాలకు రావాలి.
- **సారథినగర్, గాంధీచౌక్ :** గాంధీచౌక్, నాయుడు సిల్క్స్, పీఎస్‌ఆర్ రోడ్, గుంటి మల్లన్న ట్రంక్ రోడ్ మీదుగా నయాబజార్ మున్నేరు నిమజ్జనం పాయింట్‌కు చేరుకోవాలి.
- తిరుగు ప్రయాణంలో కూడా వాహనాలతో పోలీసులు సూచించిన మార్గాల్లోనే వెళ్లాలి.

క్లుప్తంగా

నేడు జిల్లాలో మంత్రి పువ్వాడ పర్యటన

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్ర రవాణశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ బుధవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఖమ్మం లకారం ట్యాంక్‌బండ్‌పై ఉదయం జరిగే కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి ఉత్సవాల్లో ఆయన పాల్గొంటారు. ఆతర్వాత 10వ డివిజన్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశాక, తిరుమలాయపాలెంలో సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తారు. అలాగే, ఆర్అండ్‌బీ రహదారి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్న మంత్రి.. గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించి ప్రజలను ఉద్దేశించి మాట్లాడతారు. ఆతర్వాత ఖమ్మంలో జరిగే వినాయక నిమజ్జన శోభాయాత్రలో పాల్గొంటారు.

ఎంపీ నామ పర్యటన

బీఆర్ఎస్ లోక్‌సభా పక్షనేత, ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు బుధవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఖమ్మం కార్పొరేషన్, తిరుమలాయపాలెం మండలాల్లో జరిగే కార్యక్రమాల్లో రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ తాతా మధుతో కలిసి ఆయన పాల్గొంటారు. అలాగే, ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని పలు కుటుంబాలను ఎంపీ పరామర్శిస్తారు.

బీజేపీ జిల్లా ఇన్‌చార్జ్‌గా త్రిలోకేశ్వర్

ఖమ్మం మామిళ్లగూడెం: భారతీయ జనతా పార్టీ ఖమ్మం జిల్లా ఇన్‌చార్జ్‌గా వరంగల్‌కు చెందిన కలవల త్రిలోకేశ్వర్‌ను నియమించారు. రాష్ట్రంలోని ఏడు జిల్లాలకు ఇన్‌చార్జ్‌లను నియమించగా ఖమ్మంకు ఆయనను కేటాయిస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి మంగళవారం ప్రకటన విడుదల చేశారు.

కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలి



సమ్మెలో పాల్గొన్న అధ్యాపకులు

ఖమ్మం సహకారనగర్: రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల్లో కాంట్రాక్ట్ విధానంలో పనిచేస్తున్న అధ్యాపకులను రెగ్యులర్ చేయాలని పలువురు డిమాండ్ చేశారు. ఖమ్మంలోని కేయూ పీజీ కళాశాలలో మంగళవారం కాంట్రాక్ట్ అధ్యాపకులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్యాంబాబు, కోటి మాట్లాడుతూ పదిహేను రోజులుగా వివిధ రూపాల్లో నిరసన తెలుపుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని తెలిపారు. దీంతో నిరవధిక సమ్మెకు దిగినట్లు చెప్పారు. అధ్యాపకులు గోపి, మధు, రవిబాబు, వీరన్న, వీరాంజనేయులు, రమ, లక్ష్మీహరిత, రాజీవ్‌రాజ్, జగ్జీవన్, చలపతి, శ్రీనివాస్ పాల్గొనగా ప్రిన్సిపాల్ రవికుమార్ మద్దతు తెలిపారు.

విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తి పెంపొందించాలి

పీడీల సమావేశంలో డీఐఈఓ రవిబాబు

ఖమ్మంసహకారనగర్: కళాశాలల విద్యార్థులు జిల్లా, రాష్ట్రస్థాయి క్రీడాపోటీల్లో సత్తా చాటేలా ఫిజికల్ డైరెక్టర్లు తర్ఫీదునివ్వాలని ఖమ్మం జిల్లా ఇంటర్‌మీడియట్ విద్యాశాఖాధికారి (డీఐఈఓ) కె.రవిబాబు సూచించారు. ఖమ్మం కలెక్టరేట్‌లో మంగళవారం ఖమ్మం, భద్రాద్రి జిల్లాల ఫిజికల్ డైరెక్టర్లు, పీఈటీల సమావేశం నిర్వహించగా ఆయన మాట్లాడారు. అండర్ – 19 ఉమ్మడి జిల్లా ఫుట్‌బాల్(బాలుర) ఎంపిక పోటీలు ఈ నెల 28న సర్దార్ పటేల్ స్టేడియంలో జరగనున్నందున విద్యార్థులు పాల్గొనేలా చొరవ తీసుకోవాలని చెప్పారు. అనంతరం 2023 – 25కు గాను అండర్ – 19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శిగా కారేపల్లి మోడల్ కాలేజీ పీడీ ఎండీ మూసాను ఎన్నుకున్నారు.

నేడు, రేపు మార్కెట్‌కు సెలవు

ఖమ్మంవ్యవసాయం: వినాయక నిమజ్జనం, మిలాదున్‌నబీ పండుగలను పురస్కరించుకుని బుధ, గురువారం ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు సెలవులు ప్రకటించారు. ఈ విషయాన్ని మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి రుద్రాక్షి మల్లేశం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు, వ్యాపారులు, కార్మికులు ఈ విషయాన్ని గమనించాలని, తిరిగి శుక్రవారం మార్కెట్‌లో కొనుగోళ్లు యథావిధిగా ఉంటాయని వెల్లడించారు.

గడప గడపకూ న్యాయసాయం



ఖమ్మంలీగల్: అవసరమైన వారికి న్యాయసాయం అందించేలా పారామెడికల్ వలంటీర్లు కృషి చేయాలని ఖమ్మంజిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి మహ్మద్ అబ్దుల్ జావీద్‌పాషా సూచించారు. ఖమ్మంలో మంగళవారం జరిగిన పారా లీగల్ వలంటీర్ల సదస్సులో ఆయన మాట్లాడారు. మహిళలకు చట్టప్రకారం అందేలా సాయం విషయమై ప్రచారం చేయాలని తెలిపారు. బాల్యవివాహాలను నిరోధానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. కాగా, యాసిడ్ దాడి బాధిత మహిళలకు ఆస్పత్రుల్లో చికిత్స నిరాకరిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,026

వారంలోగా రైతు రుణమాఫీ ప్రక్రియ పూర్తి

సమీక్షలో కలెక్టర్ గౌతమ్ ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్, పక్కన డీసీసీబీ చైర్మన్ నాగభూషణం, అధికారులు

ఖమ్మంసహకారనగర్: రైతులు తీసుకున్న పంట రుణాల మాఫీ ప్రక్రియను వారంలోగా పూర్తి చేయాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణంతో కలిసి రుణ మాఫీపై కకలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 89,093 మంది రైతులకు సంబంధించి రూ.374.42 కోట్ల రుణాలు మాఫీ అయ్యాయని తెలిపారు. ఆయా రైతులకు రెన్యూవల్ చేయాలని సూచించారు. వ్యవసాయ శాఖ అధికారులు బ్యాంకర్ల నుండి జాబితా తీసుకొని రుణాల రెన్యూవల్‌పై దృష్టి సారించాలని తెలిపారు. అనంతరం డీసీసీబీ చైర్మన్ నాగభూషణం మాట్లాడగా అదనపు కలెక్టర్ డి.మధుసూదన్‌నాయక్, డీసీసీబీ సీఈఓ వీరబాబు, ఎల్‌డీఎం శ్రీనివాసరెడ్డి, డీసీఓ విజయకుమారి, డీఏఓ సరిత తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో ప్రత్యేక సెల్

ఖమ్మంవ్యవసాయం: రైతుల రుణమాఫీ పథకానికి సంబంధించి కలెక్టరేట్‌లో ప్రత్యేక సెల్ ఏర్పాటుచేశారు. డీసీసీబీ పరిధిలో 1.63 లక్షల మందికి రుణాలు ఇవ్వగా, రూ.617 కోట్లను మాఫీ చేసేందుకు టెస్కాబ్‌కు నివేదిక సమర్పించారు. ఇందులో ఇంకా 90,459 మంది రైతులకు రుణమాఫీ కావాల్సి ఉండగా, వాణిజ్య బ్యాంకుల పరిధిలోనూ ఇదే పరిస్థితి ఉంది. దీంతో రైతుల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు కలెక్టరేట్‌లో ప్రత్యేక సెల్ ఏర్పాటుచేసి ముగ్గురు అధికారులను నియమించారు. ఈమేరకు రైతులు తమ ఆధార్ కార్డుతో ఏ.రాము(96766 13662), పి.శ్రీనివాస్(72888 94205), కె.అనసూయ(96763 87223) ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు సంప్రదించి సమస్యలను వివరించవచ్చు. అలాగే, తమ ప్రాంత ఏఈఓలు, ఏఓ, ఏడీఏలను కూడా సంప్రదించవచ్చని డీఏఓ బి.సరిత తెలిపారు.

పేదలకు మెరుగైన సేవలు

ఖమ్మంవైద్యవిభాగం: ప్రభుత్వ ఆస్పత్రిపై నమ్మకంతో వచ్చే పేదలకు మెరుగైన సేవలందించాలని కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన ఓపీ విభాగం, ఫార్మసీ, డిస్పెన్సరీల్లో పరిశీలించి సూచనలు చేశారు. ప్రధాన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సొసైటీ గోదాంకు స్థలం అప్పగింత

నేలకొండపల్లి: మండలంలోని రాజారాంపేట పీఏసీఎస్ గోదాం నిర్మాణానికి అవసరమైన స్థల పత్రాలను చైర్మన్ పగిడిపత్తి శ్రీనివాస్‌కు కలెక్టర్ గౌతమ్ అందజేశారు. సొసైటీ పరిధిలో 500 మెట్రిక్ టన్నుల గోదాం నిర్మించేందుకు చెరువుమాదారంలోని డబుల్‌బెడ్ రూం ఇళ్ల వద్ద ఆరు కుంటల స్థలాన్ని కేటాయించారు. డీసీసీబీ చైర్మన్ నాగభూషణం, డీసీఓ విజయకుమారి, సొసైటీ కార్యదర్శి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఉత్తమ ఉద్యోగులకు అవార్డులు



సన్మానం అందుకున్న ఉద్యోగులతో అధికారులు

మధిర: మధిర ఆర్టీసీ డిపోలో విధులు నిర్వర్తిస్తూ వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన ఉద్యోగులను మంగళవారం అవార్డులు అందజేశారు. డిపో కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వినోద్‌కుమార్ ఉద్యోగులను సన్మానించి మాట్లాడారు. అనంతరం డిపోలో అన్ని విభాగాలను తనిఖీ చేసి మాట్లాడుతూ ప్రయాణికులతో మర్యాదగా వ్యవహరిస్తూ సంస్థ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఖమ్మం రీజినల్ మేనేజర్ వెంకన్న, డిప్యూటీ రీజినల్ మేనేజర్లు పవిత్ర, భవానీప్రసాద్, డిపో మేనేజర్ దేవదానం పాల్గొన్నారు.

పర్యాటక వేడుకల్లో చంద్రయాన్ ప్రదర్శన



చంద్రయాన్-3 నమూనా ప్రదర్శనను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ జకీరుల్లా

ఖమ్మం స్పోర్ట్స్: ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని ఎస్ఆర్అండ్ బీజీఎన్ఆర్ కళాశాలలో ఏర్పాటుచేసిన వేడుకలను మంగళవారం ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.డీ.జకీరుల్లా ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇటీవల ఇస్రో ప్రయోగించిన చంద్రయాన్ –3 విజయవంతం కావడం వెనుక ఎందరో శాస్త్రవేత్తల కృషి ఉందని తెలిపారు. జిల్లా పర్యాటక శాఖ అధికారి సుమన్‌చక్రవర్తి మాట్లాడుతూ పర్యాటక దినోత్సవం సందర్భంగా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఇందులో భాగంగానే చంద్రయాన్-3 ప్రయోగాన్ని విద్యార్థులకు వివరించేలా ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ఈకార్యక్రమంలో కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ బి.వెంకన్న, వివిధ పాఠశాలల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. చంద్రయాన్ – 3 ప్రయోగ విశేషాలకు విద్యార్థులు ఆసక్తిగా తెలుసుకోగా, అనంతరం చిత్ర ప్రదర్శనను తిలకించారు.

'ఆరోగ్య మహిళ'పై ప్రత్యేక శ్రద్ధ



మహిళలతో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ మాలతి

ముదిగొండ: ప్రభుత్వం ఆస్పత్రుల్లో ప్రతీ మంగళవారం మహిళలకు ప్రత్యేక వైద్యపరీక్షలు చేసేందుకు ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని అమలుచేస్తున్నట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ మాలతి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె ముదిగొండ పీహెచ్‌సీని తనిఖీ చేసి మాట్లాడారు. పరీక్షల కోసం వచ్చిన మహిళలతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఎక్కువ మంది సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని వైద్యాధికారి అరుణాదేవికి సూచించారు. సీహెచ్ఓ దుర్గామల్లేశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు. కాగా, కొన్నేళ్లుగా కాంటిన్‌జెంట్ వర్కర్‌గా పనిచేస్తున్న అంతోటి కౌసల్య తమ సమస్యలు పరిష్కరించాలని పీహెచ్‌సీ బైఠాయించి నిరసన తెలిపింది. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లానని వైద్యురాలు చెప్పడంతో ఆందోళన విరమించింది.

అంగన్‌వాడీల సమస్యలు మేనిఫెస్టోలో చేరుస్తాం..

మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్



సత్తుపల్లి : అంగన్‌వాడీల సమ్మె శిబిరంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి చంద్రశేఖర్

సత్తుపల్లి/కల్లూరు: అంగన్‌వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలను కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో చేర్చి అధికారంలోకి రాగానే పరిష్కరిస్తామని మాజీ మంత్రి, టీ పీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు సంభాని చంద్రశేఖర్ తెలిపారు. సత్తుపల్లి, కల్లూరులో అంగన్‌వాడీల సమ్మె శిబిరాలను మంగళవారం సందర్శించిన ఆయన సంఘీభావం తెలిపి మాట్లాడారు. ఏదిఏమైనా వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించి అధికారంలోకి వస్తుందని తెలిపారు. ఈమేరకు పార్టీ మేనిఫెస్టో కమిటీ సభ్యునిడి అంగన్‌వాడీల సమస్యలను చేర్చి పరిష్కరించేలా కృషి చేస్తానని చెప్పారు. ఆతర్వాత మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మె శిబిరాన్ని కూడా సందర్శించిన సంభాని.. జీఓ 8 ప్రకారం కార్మికుల వేతనాలు పెంచి బకాయిలను చెల్లిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌తో పాటు వివిధ పార్టీల నాయకులు ఎం.డీ.అమర్‌జహబేగ్, దొబ్బల సౌజన్య, కొర్రపాటి సాల్మన్‌రాజు, శివవేణు, కనపర్తి కుమారి, కాలం కృష్ణ, పెద్దబోయిన దుర్గాప్రసాద్, కసర చంద్రశేఖర్‌రెడ్డి, రాయల కోటేశ్వరరావు, తోట రాజేష్, శీలం వెంకటేశ్వరరావు, సుభాని, మోదుగు రామకృష్ణ, తేళ్లూరి అర్జున్‌రావు, పెద్దబోయిన దుర్గాప్రసాద్, కొండూరు కిరణ్‌కుమార్, మాదిరాజు లక్ష్మణరావు, చుక్కా, బొడ్డు కృష్ణ, గుండ్ల పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

నూతన విద్యావిధానం రద్దు కోసం పోరాటాలు



సమావేశంలో మాట్లాడుతున్న శివరామకృష్ణ

ఖమ్మంమయూరిసెంటర్: నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేసే వరకు పోరాటాలు చేపట్టనున్నామని ఏఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు రావి శివరామకృష్ణ తెలిపారు. ఖమ్మంలోని గిరిప్రసాద్ భవన్‌లో మంగళవారం జరిగిన ఏఐఎస్ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ భవిష్యత్ తరగతి గదుల్లో రూపుదిద్దుకోవాల్సి ఉండగా.. ప్రస్తుతం పాలకుల తీరుతో కార్పొరేట్ల కనుసన్నల్లో నడుస్తోందని ఆరోపించారు. నూతన జాతీయ విద్యావిధానం ద్వారా కార్పొరేటీకరణ, ప్రైవేటీకరణ, కాషాయీకరణ చేయటానికి కుట్ర పన్నారని తెలిపారు. కాగా, కేంద్రప్రభుత్వం కక్షపూరితంగానే తెలంగాణకు నవోదయ, కేంద్రియ విద్యాలయాలు, ట్రిపుల్‌ల్ ఐటీలు, గిరిజన యూనివర్సిటీని మంజూరు చేయడం లేదని ఆరోపించారు. కాగా, ఈనెల 28 నుండి అక్టోబర్ 1 వరకు బీహార్ రాష్ట్రంలో జరగనున్న ఏఐఎస్ఎఫ్ జాతీయ మహాసభలకు జిల్లా నుంచి అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని శివరామకృష్ణ కోరారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఇటికాల రామకృష్ణ, నాయకులు సతీష్, సుకుమార్, నవీన్, వినయ్, గోపి, నరేష్, ఉమామహేష్ తదితరులు పాల్గొన్నారు.

నవోదయ విద్యార్థి కుటుంబానికి పరిహారం

కూసుమంచి: మండలంలోని పాలేరులోని జవహర్ నవోదయ విద్యాలయలో 12వ తరగతి చదువుతున్న హలావత్ దుర్గానాగేందర్ ఇటీవల క్రీడాపోటీల ఏర్పాట్లు చేస్తూ విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ఆయన కుటుంబానికి విద్యుత్ శాఖ తరఫున రూ.5 లక్షల పరిహారం మంజూరు కాగా, తల్లిదండ్రులకు మంగళవారం ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి చెక్కు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ సంపత్‌కుమార్, ఎంపీపీ బానోత్ శ్రీనివాస్‌నాయక్, డీసీసీబీ డైరెక్టర్ ఇంటూరి శేఖర్, ట్రాన్స్‌కో ఏడీఈ కోక్యానాయక్, ఏఈ వెంకన్ననాయక్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వేముల వీరయ్య పాల్గొన్నారు.

కొనసాగుతున్న మైనార్టీ గురుకులాల క్రీడాపోటీలు



కారేపల్లి : పోటీల్లో ప్రతిభ చూపి బహుమతులు అందుకున్న విద్యార్థినులు

కారేపల్లి: ఉమ్మడి ఖమ్మం జిల్లా తెలంగాణ బాలికల మైనార్టీ గురుకులాల విద్యార్థులకు కారేపల్లిలోని గురుకులంలో నిర్వహిస్తున్న పోటీలు మంగళవారం రెండోరోజుకు చేరాయి. విద్యార్థినులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొంటూ ప్రతిభ చాటుతున్నారు. అండర్–14, 17 విభాగాల్లో 200, 400, 600 మీటర్ల పరుగు పందెంతో పాటు షార్ట్‌పుట్, ఖో–ఖో, కబడ్డీ, వాలీబాల్, టెన్నీకాయిట్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కారేపల్లి మైనార్టీ గురుకులం ప్రిన్సిపాల్ ఎం.శైలజ, విజిలెన్స్ ఆఫీసర్ సీతారాములుతో పాటు ఎండీ బాబూసాహెబ్, పాషా, హిమబిందు తదితరులు పాల్గొన్నారు.

బాలుర పోటీలు..

కొణిజర్ల: మండలంలోని అమ్మపాలెం తెలంగాణ మైనార్టీ గురుకుల బాలుర పాఠశాల, జూనియర్ కళాశాలలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఉమ్మడి జిల్లాస్థాయి బాలుర గురుకులాల క్రీడాపోటీలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. మొత్తం ఎనిమిది క్రీడాంశాల్లో అండర్ - 14, అండర్ - 17 విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నారు. రెండో రోజు పోటీలను ఖమ్మం జిల్లా విజిలెన్స్ అధికారులు జమీల్ పాషా, సీతారాములు పరిశీలించారు. క్రీడా ప్రాంగణం సౌకర్యాలు, భోజన వసతిపై ఆరా తీసి ప్రతిభ చాటిన విద్యార్థులను అభినందించారు. ప్రిన్సిపాల్ డి.సైదులు, పీఈటీలు పాల్గొన్నారు.

11,879 మంది మహిళలకు వైద్యపరీక్షలు

కామేపల్లి: జిల్లాలోని 12 పీహెచ్‌సీలో ఆరోగ్య మహిళ ద్వారా ఇప్పటి వరకు 11,879 మందికి వైద్య పరీక్షలు చేయగా.. వీరిలో 2,317 మందిని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి రిఫర్ చేశామని డిప్యూటీ డీఎంహెచ్ఓ సైదులు వెల్లడించారు. కామేపల్లి పీహెచ్‌సీలో ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని మంగళవారం తనిఖీ చేసిన ఆయన మాట్లాడారు. ప్రతీ మంగళవారం పీహెచ్‌సీలో ఆరోగ్య మహిళా ద్వారా మహిళలకు పూర్తిస్థాయిలో పరీక్షలు నిర్వహించాలని వైద్యులకు సూచించారు. అలాగే, పీహెచ్‌సీలో సాధారణ ప్రసవాల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలని తెలిపారు. సీజనల్ వ్యాధుల ప్రబలకుండా అన్ని చర్యలు తీసుకోవాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి చందన, ఉద్యోగులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో వివాహిత మృతి

చర్మం చేతికి వస్తుండడంతో

ఆస్పత్రి నుంచి నేరుగా శ్మశానవాటికకు...

కారేపల్లి: మండలంలోని ఓ గ్రామానికి చెందిన వివాహిత చర్మ సంబంధిత వ్యాధితో బాధపడుతూ మంగళవారం మృతి చెందింది. ఆమె శరీరంపై ఒక్కసారిగా బొబ్బలు వచ్చి చర్మం పాలిపోయింది. చర్మం ఎక్కడ పట్టుకున్నా చేతికి వస్తుండడంతో కుటుంబీకులు ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగా కన్నుమూసింది. అయితే, మృతదేహాన్ని తరలించాలన్నా ఇబ్బందిగా ఉండడంతో వైద్యులు ప్రత్యేకంగా భద్రపర్చగా వాహనంలో నేరుగా శ్మశానవాటికకు తీసుకొచ్చి గుంత తీసి ఖననం చేశారు. ఈ విషయం తెలియడంతో గ్రామస్తులు కొత్తగా ఏదైనా వైరస్ ప్రబలుతుందా అనే ఆందోళనకు గురయ్యారు. ఈమేరకు కారేపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి సురేష్‌ను వివరణ కోరగా ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. మహిళ అనారోగ్యం పాలైనప్పుడు వాడిన మందుల కారణంగా ఇలా(రియాక్షన్) జరిగి ఉంటుందని... చర్మం పాలిపోయి పట్టుకున్నప్పుడు చేతికి వచ్చి ఉండొచ్చని పేర్కొన్నారు.

ఉపాధ్యాయుడిని బెదిరించిన ఇద్దరి అరెస్ట్

బోనకల్: మండలంలోని రావినూతల పాఠశాల ఉపాధ్యాయుడిని అదే గ్రామానికి చెందిన ఇద్దరు బెదిరిస్తూ డబ్బులు లాక్కోగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సాయికుమార్ తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయుడిని గ్రామస్తులు షేక్ జానీపాషా, యరగాని నాగరాజు తరచూ బెదిరిస్తూ డబ్బు డిమాండ్ చేస్తున్నారు. డబ్బులు ఇవ్వకపోతే సోషల్‌మీడియాలో పోస్టులు పెడతామని బెదిరించడమే కాక ఇటీవల స్కూల్ వద్దకు వచ్చి కత్తితో చూపించి రూ.9 వేలు లాక్కెళ్లారు. ఈమేరకు మంగళవారం అందిన ఫిర్యాదుతో ఇద్దరిని అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరచగా 15 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్ఐ సాయికుమార్ వివరించారు.

క్వారీ రాళ్లు ఎగిరిపడి గాయాలు

ముదిగొండ: ముదిగొండలోని పారిశ్రామిక ప్రాంతంలో ఓ కంకర క్వారీలో మంగళవారం పేలుళ్లు చేపట్టగా భారీ శబ్దం రావడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. ఇదే సమయాన బండరాళ్లు ఎగిరిపడి ఓ ఇంటి ముందు ఉన్న సిమెంట్ రేకుల దుకాణంపై పడ్డాయి. దీంతో రేకు పగిలి దుకాణంలో ఉన్న జయమాని వేల్పుల నాగేశ్వరరావుపై పడగా గాయపడ్డాడు. క్వారీ నిర్వాహకుల అజాగ్రత్త, నిర్లక్ష్యంతోనే ఈ ఘటన జరిగిందని స్థానికులు ఆరోపించారు. ఈమేరకు ముదిగొండ ఎస్ఐ నరేష్ చేరుకుని వివరాలు సేకరించారు.

కుక్కల దాడిలో బాలుడికి...

కొణిజర్ల: వీధికుక్కల దాడిలో బాలుడికి తీవ్రగాయాలయ్యాయి. కొణిజర్ల పాత బజార్‌కు చెందిన పురోహితుడు తీర్థం వెంకటజానకీరామశర్మ – జానకి దంపతుల కుమారుడు రిత్విక్ మంగళవారం ఇంటి ఆవరణలో ఆడుకుంటున్నాడు. ఇంతలోనే వీధిలో కొట్లాటకు దిగిన రెండు కుక్కలు ఒక్కసారిగా బాలుడిపై పడి గాయపరిచాయి. దీంతో ఆయన తల, మెడ భాగంలో తీవ్ర గాయాలు కాగా ఆస్పత్రికి తరలించారు.

'సీతారామ' రూపకర్త కేసీఆరే..

- సత్తుపల్లి ఎమ్మెల్యే వెంకటవీరయ్య
- ఎంపీ పార్థసారథిరెడ్డితో కలిసి ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన



సర్పంచ్‌కు రూ.15లక్షల చెక్కు ఇస్తున్న ఎంపీ పార్థసారథిరెడ్డి, పక్కన ఎమ్మెల్యే వెంకటవీరయ్య

వేంసూరు: ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతాంగానికి మేలు చేసే సీతారామ ప్రాజెక్ట్‌కు రూపకల్పన చేసిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌దేనని సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య తెలిపారు. మండలంలోని భరణిపాడు, కందుకూరు, వెంకటాపురం, భీమవరం తదితర గ్రామాల్లో రాజ్యసభ సభ్యుడు బండి పార్థసారధిరెడ్డితో కలిసి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడమే కాక పూర్తయిన పనులను ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీతారామ ప్రాజెక్టు ద్వారా జిల్లా రైతాంగానికి సాగునీరు అందించేలా ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ ఘనత కేసీఆర్‌దే తప్ప మరెవరిదీ కాదని చెప్పారు. పదిహేనేళ్లుగా ప్రజల కష్టసుఖాల్లో పాలు పంచుకుంటున్న తనను మరోమారు ఆశీర్వదించాలని కోరారు. ఒకనాడు కత్తులు దువ్వుకున్న వారు ఇప్పుడు ఒకే రథంపై తిరుగుతున్న విషయాన్ని గుర్తించాలన్నారు. అనంతరం ఎంపీ పార్థసారధిరెడ్డి మాట్లాడుతూ తెలంగాణతో పాటు సత్తుపల్లిలో అభివృద్ధి అగొద్దనుకుంటే ముఖ్యమంత్రిగా కేసీఆర్‌ను, ఎమ్మెల్యే వెంకటవీరయ్య మళ్లీ ఆశీర్వదించాలని కోరారు. మంచి నిత్యం ప్రజల్లో ఉంటూ అందరి కష్టసుఖాల్లో పాలుపంచుకునే సండ్రను ఆశీర్వదించాలని తెలిపారు. తన స్వగ్రామమైన కందుకూరు, ఆతర్వాత వేంసూరు మండలాన్ని అభివృద్ధి చేసే బాధ్యత తనదేనని చెప్పారు. ఈమేరకు వెంకటపురం అభివృద్ధికి తన సొంత నిధులు రూ.15లక్షలను సర్పంచ్ పాల వెంకటరెడ్డికి అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పగుట్ల వెంకటేశ్వరరావు, తహసీల్దార్ ఎం.ఏ.రాజేతో పాటుట మందపాటి మహేశ్వరరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, ఎండీ.పైజుద్దీన్, బూరుగు నాగేశ్వరరావు, దొడ్డా శ్రీలక్ష్మి, పుచ్చకాయల చెన్నకేశవరెడ్డి, గొర్ల శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులపై ప్రభుత్వం ఉక్కుపాదం

- టీఎస్‌పీఎస్‌సీ వైఫల్యంతోనే గ్రూప్ – 1 పరీక్ష రద్దు
- ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు



సమావేశంలో మాట్లాడుతున్న రంగారావు, పక్కన నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్రంలో ఉద్యమకారులపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోందని.. ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు ఆరోపించారు. ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాపంథా భద్రాచలం డివిజన్ కార్యదర్శి, చర్ల వాసి కొండా చరణ్‌పై పోలీసులు రాజద్రోహం, ఉపా చట్టం, పేలుడు పదార్థాల సెక్షన్ల కింద కేసులు నమోదు చేయడం గర్హనీయమన్నారు. అక్రమంగా నల్లచట్టాలను ప్రయోగించడం కేసీఆర్ ప్రభుత్వానికి ఆనవాయితీగా మారిందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వంతో కలిసిన కేసీఆర్ ప్రభుత్వం హరగోపాల్ తదితరులపై కేసులు పెట్టారన్నారు. కాగా, చరణ్‌పై కేసులు ఉపసంహరించుకోవాలనే డిమాండ్‌తో ఈ నెల 28న ఉమ్మడి ఖమ్మం జిల్లాలో నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. కాగా, ప్రభుత్వం, టీఎస్‌పీఎస్‌సీ కలిసి నిరుద్యోగులను ఇబ్బంది పెడుతున్నారని, లక్షలాది మంది జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని మండిపడ్డారు. ఉద్యోగాలు ఇవ్వొద్దనే ఉద్దేశంతోనే తప్పుడు నిర్ణయాలు తీసుకుంటున్నారని.. ఫలితంగా కోర్టు పరీక్షను రద్దు చేసిందని తెలిపారు. కాగా, గొత్తికోయలకు ఓటర్, రేషన్ కార్డులు మంజూరు చేసి ఇతర సౌకర్యాలు కల్పించాలని రంగారావు డిమాండ్ చేశారు. సమావేశంలో ప్రజాపంథా ఖమ్మం, భద్రాద్రి జిల్లాల కార్యదర్శులు గోకినేపల్లి వెంకటేశ్వర్లు, కెచ్చల రంగారెడ్డి, నాయకులు గుర్రం అచ్చయ్య, ఆవుల వెంకటేశ్వర్లు, సీవై పుల్లయ్య, జి.రామయ్య, కెచ్చల కల్పన, మలీదు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

30న ఎన్పీడీసీఎల్ సీఎండీతో భేటీ



జిల్లా ప్రతినిధులతో ఇనుగాల శ్రీధర్, తదితరులు

ఖమ్మంవ్యవసాయం: విద్యుత్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈనెల 30న ఎన్పీడీసీఎల్ సీఎండీతో సంయుక్త సమావేశం జరగనుందని తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల సంఘం(327) రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్ తెలిపారు. ఖమ్మంలోని విద్యుత్ వసతి గృహంలో సంఘం జిల్లా అధ్యక్షుడు మందపాటి సత్యనారాయణరెడ్డి అధ్యక్షతన మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 30న జరగనున్న సమావేశంలో సీఎండీ దృష్టికి కార్మికుల సమస్యలను తీసుకెళ్లి పరిష్కారానికి కృసి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీలం ఐలేష్‌తో పాటు పి.మహేందర్‌రెడ్డి, సీతారాం గోపాల్, ఏ.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కూలిన ఓవర్ హెడ్ ట్యాంక్ స్లాబ్



స్లాబ్ కూలడంతో ధ్వంసమైన వాహనం

తల్లాడ: మండలంలోని మల్లవరంలో 30 ఏళ్ల క్రితం నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంక్ స్లాబ్ మంగళవారం మూడు వైపులా కూలింది. అయితే, ఆ సమయాన ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పగా, గుడిపల్లి చంటికి చెందిన మోటార్ సైకిల్‌పై పెచ్చులు పడడంతో ధ్వంసమైంది. అంతకు ముందే ట్యాంక్ వద్ద పలువురు ఉండగా, వర్షం రావడంతో పక్కనే గ్రామపంచాయతీ కార్యాలయంలోకి వెళ్లారు. ఆ వెంటనే స్లాబ్ పెచ్చులు కూలి పడగా వారు ప్రమాదం నుంచి బయటపడినట్లయింది. కాగా, మిషన్ భగీరథ ఏఈ సింధు ట్యాంక్‌ను పరిశీలించి సమీపాన ఎవరూ వెళ్లకుండా కంచె ఏర్పాటు చేయించారు.

ట్రయల్ రన్‌లో లీకేజీలు

ఖమ్మంఅర్బన్: ఖమ్మం 15వ డివిజన్ అల్లీపురం పాఠశాలలో నిర్మించిన మిషన్ భగీరథ ట్యాంక్ నాణ్యతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రూ.లక్షల వ్యయంతో ఈ ట్యాంకు నిర్మించగా ఇటీవల ట్రయల్ రన్ చేసేందుకు నీరు అయితే, ట్యాంకు చుట్టూ ధారాళంగా నీరు లీకేజీ అవుతుండడంతో భవిష్యత్‌లో ఎలా ఉంటుందని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై కార్పొరేటర్ రావూరి కరుణ సైదుబాబు మాట్లాడుతూ కొన్నాళ్లు ఇలాగే ఉంటుందని కాంట్రాక్టర్ చెప్పగా... అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

కారేపల్లి: మండలంలోని భాగ్యనగర్ తండా గ్రామంలో చోరీ జరిగింది. గ్రామానికి చెందిన బానోతు చందు మంగళవారం ఉదయం కుటుంబీకులతో కలిసి చేనుకువెళ్లాడు. దీంతో దుండగులు ఇంటి తాళం, బీరువా తాళం పగులకొట్టి రూ.50వేల నగదు ఎత్తుకెళ్లారు. సాయంత్రం ఇంటికి వచ్చాక ఈ విషయాన్ని గుర్తించిన చందు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.